క్లుప్తంగా

పాఠశాలకు కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్లను ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఈఓ పి.వి.రమణ

వేపాడ: మండలంలోని సోంపురం ఉన్నత పాఠశాలకు ఆదే పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేసి న ఎం.ఈశ్వరి జ్ఞాపకార్థం ఆమె కుమార్తె హర్షిణి భవానీ రెండు కంప్యూటర్లు వితరణ చేశారు. వీటిని డిప్యూటీ డీఈఓ పి.వి.రమణ శుక్రవారం ప్రారంభించారు. హెచ్ఎం బి.పి.ఎ. రాజు, ఎంఈఓలు జగదీశ్వరరావు, బాలభాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరిహారం అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన గరివిడి మండలంలోని అర్తమూరుకు చెందిన మహంతి నారాయణరావు కుటుంబానికి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు కోటి రూపాయల చెక్కు అందజేశారు. మృతుడి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చి, ధైర్యం చెప్పారు. మండల ప్రత్యేకాధికారి వై.వి. రమణ, తహసీల్దార్ బంగార్రాజు, ఎంపీడీఓ జి.భాస్కరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులాహ్వానం

గుర్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.సురేష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకుడి పోస్టు ఖాళీగా ఉం దని, సంబంధిత సబ్జెక్టులో 50 శాతం మార్కులతో పీజీ పూర్తిచేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 27లోగా కళాశాలలో నేరుగా అందజేయాలని సూచించారు.

కర్లాంలో నేత్ర వైద్యశిబిరం

చీపురుపల్లి: మండలంలోని కర్లాం గ్రామంలో పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన 162 మందికి విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు నేత్రపరీక్షలు చేశారు. వీరిలో 72 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బి.వి.గోవిందరాజులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. వాసవీక్లబ్ వనిత ఉమెన్ ఎంపైర్ ఆధ్వర్యంలో అమ్మవారికి 108 చీరలతో అలంకరించారు. క్లబ్ అధ్యక్షురాలు వి.సంతోషి, ప్రతినిధులు అమరశ్యామ, శ్రీదేవి పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి నిధులు కేటాయించాలి

చీపురుపల్లి: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)కు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను నియోజకవర్గ బీజేపీ కో–కన్వీనర్ మన్నెపురి శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో సీహెచ్‌సీని 100 పడకల ఆస్పత్రిగా అభి వృద్ధి చేస్తూ జీఓ నంబర్ 233ను తీసుకొచ్చారని మంత్రికి శ్రీనివాసరావు వివరించారు. ప్రభు త్వం మారిన నేపథ్యంలో ఆ జీఓ ప్రకారం ఆస్పత్రికి రావాల్సిన నిధులు కేటాయించి భవనాలు, ఇతర సదుపాయాలు కల్పించాలని, వైద్య సిబ్బందిని నియ మించాలని కోరారు.

పనులు పూర్తి చేయండి

గజపతినగరం రూరల్: గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో మధ్యలో నిలిచిపోయిన వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు పూర్తి చేసేలా చూడాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రిని మరుపల్లి సమీపంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆస్పత్రిలో సమస్యలను ఆయనకు వివరించారు. ఆస్పత్రి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీష్, పాలిటెక్నిక్ కళాశాల డైరెక్టర్ శేఖర్ ఉన్నారు.



భద్రత పెంచాల్సిన అవసరం ఉంది

ఆస్పత్రుల్లో మహిళా వైద్యులు, సిబ్బందికి సంబంధించి భద్రత పెంచాల్సి ఉంది. సీహెచ్‌సీలో ప్రస్తుతం నలుగురు ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు ఉన్నా రు. అందు లోపగలు ముగ్గురు, రాత్రి సమయాల్లో ఒక్కరే విధులు నిర్వహిస్తారు. రాత్రి వేళల్లో రోగుల వెంట వచ్చే వారిలో చాలా మంది మద్యం తాగి ఉంటున్నారు. వారి నుంచి భద్రత చాలా అవసరం. మితిమీరిన సమయాల్లో వైద్యులు పోలీస్‌స్టేషన్‌కు కాల్ చేసి భద్రత కోరుతారు. 50 పడకల సీహెచ్‌సీని 100 పడకల ఆస్పత్రిగా స్థాయి పెంచిన నేపథ్యంలో ఇక్కడ పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయడం ఎంతో అవసరం.

– డాక్టర్ ఎం.నాయక్, సూపరింటెండెంట్, చీపురుపల్లి సీహెచ్‌సీ



మహిళా సిబ్బందికి రక్షణ కరువు



ఆస్పత్రిలో పనిఒత్తిడి చాలా ఎక్కువగా ఉంది. ఉన్న వనరులతో సర్దుకుని పని చేస్తున్నాం. కొందరు మద్యం తాగొచ్చి గొడవ చేస్తుంటారు. ఆ సమయాల్లో వైద్యులు, సిబ్బందిపై అరవడం, కేకలు వేయడం, తప్పుగా మాట్లాడుతుండడం చాలా బాధగా ఉంటుంది. నైట్ వాచ్‌మన్ లేరు. డ్రెస్సింగ్ రూమ్, రెస్ట్‌రూమ్, టాయి లెట్స్ లేవు. ఊరికి దూరంగా పీహెచ్‌సీ ఉంది. సీసీ కెమెరాలు లేవు. విద్యుత్ సమస్య ఉంది. ఆస్పత్రిలో మహిళా సిబ్బంది రక్షణకు భరోసా లేదు. వైద్యులతో పాటు సిబ్బందిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించేలా చట్టాలు రావాలి.– జె.హారిక, కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారి, ఎస్.కోట మండలం.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

● ఉపాధి పనుల ఎంపికపై గ్రామసభలు



వేపాడ: బొద్దాం గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



శృంగవరపుకోట: ఎల్.కోట మండలం చందులూరు సభలో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసరావు



మెరకముడిదాం: ఉత్తరావల్లిలో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసరావు



గజపతినగరం: గజపతినగరం సభలో ఎంపీపీ జ్ఞానదీపిక, జెడ్పీటీసీ తవుడు, తదితరులు



చీపురుపల్లి: చీపురుపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ఉపసర్పంచ్ బెల్లాన శ్రీదేవి

శృంగవరపుకోట: రాజకీయాలకతీతంగా గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా అంతా సమన్వయంతో ఊరికి ఉపయోగపడే పనులను ఎంపిక చేసుకుని, ఉపాధి హామీ పథకం ద్వారా వాటిని ప్రాధాన్యతాక్రమంలో చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఉపాధి హామీ పనుల ఎంపికపై ఎల్.కోట మండలంలోని చందులూరులో సర్పంచ్ యడ్ల సింహాచలం అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన గ్రామసభకు జెడ్పీ చైర్మన్ అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వ్యవ సాయ, ఉద్యానవన పంటల సాగుకు ఊతమిచ్చేలా ఉపాధిహామీ పనులను ప్రతిపాదించడం మంచి ఆలోచన అని చెప్పారు. గ్రామా ల్లో వేతనదారులకు 100 పనిదినాలు కల్పిస్తున్నామని, ఉపాధి పనుల వల్ల వలసలు తగ్గాయన్నారు. ఉద్యానవన తోటల పెంపకాన్ని ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. పొలాల గట్లపై మొక్కల పెంపకం, తోటల్లో ట్రెంచ్‌ల ఏర్పాటు, గృహ నిర్మాణం, మౌలిక సౌకర్యాల కల్పన, రోడ్లు, డ్రైన్లు, కాలువలు, మదుములు, చప్టాలు, కల్వర్టుల నిర్మాణం వంటి పనులను ఉపాధి పథకం ద్వారా చేసుకోవచ్చని, గ్రామాల అభివృద్ధికి ఈపథకం ఎంతో ఉపయోగ పడుతోందన్నారు. ఈపథకాన్ని సద్వినియోగించుకోవడంలో జిల్లా తొలి స్థానంలో ఉందని, వెనుకబడ్డ జిల్లాకు ఉపాధి పనులు ఊతమిచ్చాయన్నారు. గ్రామానికి కావాల్సిన విద్యుత్ స్తంభాలను జెడ్పీ నిధులతో ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, ఎంపీడీఓ కె.రూపేష్, ఏపీఓ విజయలక్ష్మి, ఎంపీటీసీ ఎడ్ల కిశోర్ ఇంజినీరింగ్, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రజోపయోగ పనులను గుర్తించాలి

మెరకముడిదాం: గ్రామాల అభివృద్ధికి, ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించి ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాలని జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఉపాధి పనుల ఎంపికపై ఉత్తరావల్లి గ్రామం లో సర్పంచ్ కిల్లాడ విజయ ఆధ్వర్యం లో శుక్రవారం నిర్వహించిన గ్రామసభకు ఆయన అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సాగునీటి వన రుల అభివృద్ధి పనులకు, ఉద్యానవన పంటల సాగు పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, ఎంపీడీఓ ఎం.రత్నం, ఉపాధి హామీ పథకం ఏపీడీ మీసాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ టి.హరిబాబు, నాయకులు ఎస్.వి.రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, పప్పల కృష్ణమూర్తి, ఎస్.సీతారామరాజు, ఎం.సత్యనారాయణ, ఎం.రమణ మోహనరావు పాల్గొన్నారు.

సద్వినియోగించుకోండి

వేపాడ: ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగించుకోవాలని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని 29 పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. బొద్దాం గ్రామసభకుఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి, వాటిని పంచాయతీల ఆమోదంతో ఉపాధి పథకం ద్వారా చేసుకోవాలని చెప్పారు. కుమ్మపల్లిలో నిర్వహించిన సభలో ఎంపీపీ దొగ్గ సత్య వంతుడు, చినగుడిపాలలో డీసీసీబీ మాజీ చైర్మన్ చినరామునాయుడు, పలు గ్రామసభల్లో మండల ప్రత్యేకాధికారి పి.ఎస్.వి.లక్ష్మీనారా యణ,ఎంపీడీఓ కూర్మనాథ్ పట్నాయక్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

● గుర్ల: గ్రామాల అభివృద్ధిలో అంతా భాగస్వామ్యం కావాలని ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు అన్నారు. మండలంలోని 40 పంచాయతీల్లో సర్పంచ్‌లు ఆధ్వర్యంలో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. పాలవలస సభకు ఎంపీపీ, భూపాలపురం సభకు జెడ్పీటీసీ అతిథులుగా హాజరయ్యారు.

● దత్తిరాజేరు: మండలంలోని 35 గ్రామపంచాయతీల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. పెదమానాపురం సభలో జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, బూపాలరాజపురం సభలో వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పథకం ద్వారా సీసీరోడ్లు,కాలువలు, గ్రావెల్ రోడ్లు ,పశువుల, గొర్రెల షెడ్లు, బావుల నిర్మాణం వంటి పనులు చేసుకోవాలని చెప్పారు.

● గజపతినగరం: జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి ఉపాధి పనికల్పించాలని సంబంధిత అధికారులను ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జెడ్పీటీసీ గార తవుడు ఆదేశించారు. గజపతినగరం గ్రామ సచివాలయం –2 లో సర్పంచ్ నరవ కొండమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు వారు అతిథులుగా హాజరయ్యారు. పంచాయతీలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను ఎంపిక చేశారు. పురిటిపెంటలో సర్పంచ్ శొంఠ్యాన విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఎంపీడీఓ కిశోర్‌కుమార్, వైస్ ఎంపీపీ కర్రి శ్రీదేవి,మాజీ మంత్రి పడాల అరుణ పాల్గొన్నారు.

● చీపురుపల్లి: స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో ఉపసర్పంచ్ బెల్లాన శ్రీదేవి మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో చేపట్టనున్న పనుల కోసం పంచాయతీలో అన్ని ప్రాం తాల నుంచి దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి, పంచాయతీ అధికారి ఝాన్సీ, వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

● బొండపల్లి: మండలంలోని 28 పంచాయతీల్లో గ్రామ సభలు జరిగాయని మండల ప్రత్యేక అధికారి ఎస్.వి.కె.దుర్గా ప్రసాద్ తెలిపారు. గరుడుబిల్లిలో సర్పంచ్ బొద్దల కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించిన సభలో రైతులకు అవసరమైన పనులను ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టడానికి తీర్మానం చేశారు. ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు హాజరయ్యారు. గ్రామాల్లో చేపట్టబోయే ఉపాధి పనులను గుర్తించి తీర్మానాలు చేశారు.



బొండపల్లి: గరుడుబిల్లిలో మాట్లాడుతున్న సర్పంచ్ కృష్ణవేణి



గజపతినగరం: గజపతినగరంసభలో పాల్గొన్న గ్రామపెద్దలు, ప్రజలు

పనుల ఎంపిక అధికారం గ్రామ సభలదే..

● కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

గంట్యాడ: గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పేర్కొన్నారు. ఉపాధి పనుల ఎంపికపై పెదవేమలిలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఎలాంటి పనులుచేపట్టాలనే అంశంపై చర్చించి, నిర్ణయాలను తీసుకునే అధికారం గ్రామసభలకే ఉంటుందన్నారు. ప్రభుత్వ యంత్రాంగం గ్రామ సభల తీర్మానాలను ఆమోదించి వాటిని అమలు చేస్తుందన్నారు. గ్రామ అవసరాలు ఏమిటి, ఏ పనులు గ్రామానికి ఉపయోగకరం అనే అంశాలపై ప్రజలంతా సమష్టిగా ఒక నిర్ణయం తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి కనీస అవసరాల కల్పన, రోడ్ల అభివృద్ధి, ప్రజల, గ్రామ సుస్థిర అభివృద్ధి సాధించడమే గ్రామ సభల ఉద్దేశమని తెలిపారు.జిల్లాలో 775 గ్రామపంచాయతీల్లో ఒకే రోజు గ్రామసభలు నిర్వహించామన్నారు. గత ఏడాది చేపట్టిన ఉపాధి పనులు గ్రామానికి ఏవిధంగా ఉపయోగపడ్డాయనే అంశాలను చర్చించుకోవాలని, అలాగే ప్రస్తుత ఏడాదిలో ఆ గ్రామానికి కేటాయించిన బడ్జెట్‌లో ఏయే పనులు ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలనే దానిపై నిర్ణయించి ప్రతిపాదనలు పంపించాలన్నారు. జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా, ఎంపీడీఓ వై.భవాని, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఎంపీటీసీ పొటువు రెడ్డి భవాని, సర్పంచ్ వర్రి పాపునాయుడు, వెలుగు ఏపీఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



వేపాడ: కుమ్మపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యవంతుడు



గుర్ల: పాలవలస సభలో మాట్లాడుతున్న ఎంపీపీ పొట్నూరు ప్రమీల



గుర్ల: భూపాలపురంసభలో అభివృద్ధి పనులపై చర్చిస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు



దత్తిరాజేరు: పెదమానాపురం సభలోమాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి, వేదికపై జెడ్పీటీసీ రాజేశ్వరి



చీపురుపల్లిరూరల్(గరివిడి):అర్తమూరు సభలో మాట్లాడుతున్న సర్పంచ్ కుమార్

ప్రోటోకాల్ పాటించక్కర లేదా..?



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట: గ్రామసభలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారులు ప్రోటోకాల్ పాటించక్కర లేదా అని ఎస్. కోట ఉపసర్పంచ్ మోపాడ కుమార్ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సాక్షిగా అధికారులను నిలదీశారు. ఉపాధి పనుల ఎంపికపై ఎస్.కోట పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ డి.సంతోషికుమారి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఉపసర్పంచ్‌ను గ్రామ సభ వేదికపైకి పిలవక పోవడంతో ఆయన ప్రోటోకాల్‌పై ప్రశ్నించారు.గ్రామసభలో ప్రోటోకాల్ పాటించక్కర లేదా, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన పంచాయతీ పాలకవర్గ సభ్యులను గౌరవించే సంప్రదాయం లేదా అంటూ అధికారులను నిలదీశారు. అతిథిగా హాజరైన ఎమ్మెల్యే లలితకుమారి జోక్యం చేసుకుని ఇటువంటి పొరబాట్లు మళ్లీ జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించి ఉపసర్పంచ్‌కు నచ్చచెప్పడంతో గ్రామసభ సాగింది.సభలో ఉప సర్పంచ్ మాట్లాడుతూ దశాబ్దాల క్రితం నామమాత్రపు అద్దెలకు 36 మందికి దుకాణాలు కేటాయిస్తే... ఇప్పుడు వారిలో మూడొంతుల మంది జీవించి లేరన్నారు. అద్దెలు పెంచకుండా, యజమానులను మార్చకుండా, పంచాయతీ ఆదాయా నికి గండి కొడుతున్నారన్నారు. దుకాణాలు తొలగించాలని, కొత్తవి కట్టాలని, అద్దెలు వందశాతం పెంచాలని ఇలా ఎన్ని దఫాలు పాలకవర్గ సమావేశాల్లో ప్రతిపాదనలు చేసినా అవన్నీ బుట్టదాఖలయ్యాయన్నారు. ఇటీవల దేవీ జంక్షన్‌లో పంచాయతీ దుకాణాన్ని ఒక వ్యక్తి రూ.27,500 అద్దెకు వేరొకరికి ఇచ్చి, తాను పంచాయతీకి మాత్రం రూ.2,500 అద్దె మాత్రమే కడుతున్నాడని సభ దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న దుకాణాన్ని చూపి ఇంటి కోసం ప్లాన్ అప్రూవల్ తీసుకుని పంచాయతీ స్థలం ఆక్రమించి దుకాణాలు కడితే అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. పంచాయతీల్లో అడ్డగోలు దోపిడీకి స్వస్తి పలికి ఆదాయమార్గాలపై దృష్టి సారించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ పంచాయతీ కార్యవర్గ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని, సరైన ఆదాయం మార్గాలపై దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. ఉపాధి పనులకు ప్రతిపాదనలు చేశారు. ఎంపీడీఓ శేషుబాబు, ఈఓ వి.అనూరాధ, వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, పాల్గొన్నారు.

ఫొటోలు తీయలేం..



ఎంఈఓకు వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

శృంగవరపుకోట: పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలను తాము తీయలేమని యూటీఎఫ్ మండల నాయకులు, ఉపాధ్యాయులు ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ నర్సింగరావును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎంసీ సభ్యులతో ఫొటోలు తీయించాలని చెప్పారు. ఇప్పుడు ఎస్ఎంసీ సభ్యులు అందుబాటులో లేకపోతే ఉపాధ్యాయుల్ని ఎస్ఎంసీ, టీఎంఎఫ్ లాగిన్‌తో ఫొటోలు తీసి పంపాలని చెబుతున్నారన్నారు. ఫొటోలు తీయాలని సీఆర్ఎంటీలతో ఎంఈఓలు తమకు ఫోన్లు చేయిస్తున్నారని, ఇటువంటి అదనపు బాధ్యతలు తమకు అప్పగించొద్దని అన్నారు. తమకు ఫొటోలు పని నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. యూటీఎఫ్ నాయకులు జి.వి.రమణ,దేముడు,నారాయణ, శ్రీనివాస్, రాము, పార్వతి, నాయుడు, మూర్తి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుర్ల: మండలంలోని నాగళ్లవలస, గుర్ల సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలకు శనివారం ఉదయం8 గంటల నుంచి మధ్యా హ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫ రా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ పూడి హరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాగళ్లవలస, గొల గాం, తాటిపూడి, వల్లాపురం, దమరసింగి, సదానందపురం, శేషపుపేట, కెల్ల, మణ్యపురిపేట, సొలిపిసోమరాజుపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సోమలింగాపురం సబ్‌స్టేషన్ పరిధిలో...

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఏఈ రమేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో గొల్లలమర్రివలస, గోపన్నవలస,బాడాం, భగీరథీపురం, కొండలావేరు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సర్పంచ్‌లు,ఎంపీటీసీలపై చిన్న చూపెందుకు..?



మాట్లాడుతున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు

దత్తిరాజేరు: గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అంటే అధికారులకు ఎందుకంత చిన్న చూపని, ప్రభుత్వ కార్యక్రమాలకు వారిని ఎందుకు ఆహ్వానించడం లేదని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు అధికారులను నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యా లయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలు సభకు వివరించారు. ఏఓ అనురాధ వ్యవసాయ ప్రగతిని చదువుతుండగా సభ్యులు అడ్డుపడ్డా రు. గ్రామాల్లో ఎరువులు, విత్తనాల పంపిణీ కార్యక్రమాలకు తమను వీఏఏలు ఎందుకు పిలవడం లేదో చెప్పాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నిలదీశారు.అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఖరీఫ్ పెట్టుబడి సహాయం ఎప్పుడు అందజేస్తారని జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, సభ్యులు నిలదీశారు. దోమల నివారణకు ఉపయోగించే ఫాగింగ్ మెషిన్లు పంచాయతీల్లో అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని వినియోగించే సిబ్బంది లేరని వైద్యాధికారులు ఆనంద్‌కుమార్, స్రవంతి దృష్టికి తెచ్చారు. కోమటిపల్లిలో తరచూ విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ మంత్రి అప్పలనాయుడు అధికారులకు వివరించారు. వైస్ ఎంపీపీ లు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి



చీపురుపల్లి: వంగపల్లిపేట పాఠశాలలో టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు



శృంగవరపుకోట: ధర్మవరం ఉన్నత పాఠశాలలో ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



శృంగవరపుకోట: పుణ్యగిరి కళాశాలలో ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



బొండపల్లి: టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ చలం నాయుడు, అధికారులు

శృంగవరపుకోట: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుణ్యగిరి డిగ్రీ కళాశాల, ధర్మవరం ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వ హించారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రకాశం పంతులు చిత్రపటాలు, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బొండపల్లిలో..

బొండపల్లి: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రప టానికి ఎంపీపీ చల్లా చలం నాయుడు, మండల ప్రత్యేక అధికారి ఎస్.వి.కె.దుర్గాప్రసాద్, ఎంపీడీఓ వై.వి.ప్రసాదరావు తదితరులు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు.

చీపురుపల్లిలో..

చీపురుపల్లి: స్థానిక వంగపల్లిపేట ప్రాథమిక పాఠశాలలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి ఉపాధ్యాయులు ఎస్. బలరాం, వలిరెడ్డి రవీంద్రనాయుడు, జి.జానకీరాం తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆంధ్ర రాష్ట్రం కోసం టంగుటూరి చేసిన త్యాగాలను విద్యార్థులకు వివరించారు.

ఉపాధి నిధులను దారి మళ్లించొద్దు...



ఎంపీడీఓ శేషుబాబుకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ ప్రతినిధులు

శృంగవరపుకోట: గ్రామసభల్లో ఉపాధి హామీ పనుల గుర్తింపు ప్రక్రియను పారదర్శకంగా చేయాలని, ఉపాధినిధులను పక్కదారి పట్టించకుండా పేదలకు ఉపాధి కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు కె.భీముడు తదితరులు శుక్రవారం ఎస్.కోటలో నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీఓ శేషుబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి చట్టంలో ఉన్న పలు పనులను క్షేత్రస్థాయిలో లేకుండా చేస్తున్నారని అన్నారు. 100రోజుల పనిదినాలను కూడా పూర్తిస్థాయిలో కల్పించడం లేదని ఆరోపించారు. అలాగే వేసవి అలవెన్స్ ఇచ్చి, రెండుపూటలా పనులు కల్పించాలని, పని ప్రాంతంలో సదుపాయాలు కల్పించాలని, రోజుకు రూ.700 వేతనం ఇవ్వాలని, ప్రతి ఒక్కరికీ 200రోజులు పని కల్పించాలని వేతనదారు భూపరిమితి 5 నుంచి 10 ఎకరాలకు పెంచాలని డిమాండ్ చేశారు.